02-06-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 245 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి

## ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు



- మమతా సర్కార్ శాశ్వతంగా కూలిపోతుంది..
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోల్‌కతాలో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 2026లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లో హింస, చొరబాటు సమస్యలను ఆయన తీవ్రంగా విమర్శించారు. బిజెపికి పెరుగుతున్న ప్రజాదరణను జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే సిఎఎను అమలు చేస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- ఈనెల 5న విచారణకు SIB మాజీ OSD హాజరు!



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ OSD ప్రభాకర్ రావు స్వదేశానికి తిరిగి వస్తున్నారు. జూన్ 5వ తేదీన ఈ కేసు వ్యవహారంలో విచారణకు హాజరవుతానని దర్యాప్తు బృందానికి ప్రభాకర్ రావు సమాచారం ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తిగా సహకరిస్తానంటూ ఇప్పటికే సుప్రీంకోర్టుకు ప్రభాకర్ రావు అండర్

...మిగతాది 2 లో

## ఏపీ ప్రజలకు తీపికబురు

- ఆ రెండు పథకాలకు డేట్ ఫిక్స్..




ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త. త్వరలోనే ఆ రెండు పథకాలను ప్రారంభించబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జూన్ నెల నుంచి తల్లికి వందనం పథకం అమలులోకి వస్తుందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నాటికి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి ఒక పేదవారి ఇంట్లో వంట చేసి, ఆ కుటుంబసభ్యులతో సరదా గడిపారు మంత్రి అనిత. రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ వేడుకగా జరిగింది. ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌లు ఒకరోజు ముందే పెన్షన్లు పంపిణీ చేశారు. అయితే ఆ నియోజకవర్గంలో మాత్రం.. రాష్ట్ర హోంమంత్రి లబ్ధిదారుల ఇంటికి వెళ్లారు.

...మిగతాది 2 లో

# పండగే పండగ..

## రాజీవ్ యువ వికాసం రుణ మంజూరు పత్రాలు అందజేత..



2 లో

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2 నుంచి రుణ మంజూరు పత్రాలు జారీచేయడానికి కాంగ్రెస్ సర్కార్ ఏర్పాట్లు చేసింది. ఈ ప్రక్రియను జూన్ 9వరకు కొనసాగించనుంది.

**జయభేరి, హైదరాబాద్ :**

వ్యాపార ఆలోచనలు ఉన్నా.. పెట్టుబడి సాయం లేక వెనుకబడిన లక్షలాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువకులకు అండగా నిలిచేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2 నుంచి రుణ మంజూరు పత్రాలు జారీచేయడానికి కాంగ్రెస్ సర్కార్ ఏర్పాట్లు చేసింది. ఈ ప్రక్రియను జూన్ 9వరకు కొనసాగించనుంది. అలాగే జూన్ 10 నుంచి 15 వరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. లబ్ధిదారులు ఎంచుకున్న రంగంలో వారికి నైపుణ్యాలు మెరుగుపరచడానికి ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. జూన్ 16 నుంచి ఉపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూతనందించి తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకురాగా.. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా యువతి, యువకుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. 16.22 లక్షల మంది తమ వ్యాపార ఆలోచనలకు రూపం ఇచ్చేందుకు సబ్సిడీతో కూడిన పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాదికి ఈ పథకం కింద 5 లక్షల మంది అర్హులను ప్రభుత్వం ఎంపిక

## పాకిస్థాన్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన భారత మంత్రి

- సింధు ఒప్పందంపై పునఃసమీక్షకు పిలుపు..




సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ద్వారా పాకిస్తాన్ సింధు జలాల ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని భారత్ ఆరోపించింది. ఇటువంటి చర్యలు ఒప్పందం అమలుకు ప్రత్యక్షంగా ఆటంకం కలిగిస్తాయని పేర్కొంది. శుక్రవారం తజికిస్తాన్‌లోని దుషాన్‌బేలో జరిగిన హిమానీనదాలపై జరిగిన మొదటి ఐక్యరాజ్యసమితి సమావేశంలో పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఫోరమ్‌ను దుర్వినియోగం చేయడానికి, ఫోరమ్ పరిధిలోకి రాని అంశాలపై పాకిస్థాన్ అనవసరమైన ప్రస్తావనలను తీసుకురావడానికి చేసిన ప్రయత్నాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం" అని పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మునుపటి వ్యాఖ్యలకు స్పందిస్తూ సింగ్ అన్నారు. పాకిస్తాన్ నుండి ఉగ్రవాదం అనేది ఒప్పందం స్ఫూర్తిని, నిబంధనలను ఉల్లంఘించడమేనని సింగ్ చెప్పారు.

1960లో ఒప్పందంపై సంతకం చేసినప్పటి నుండి వాతావరణ మార్పు, జనాభా పెరుగుదల, సాంకేతిక పురోగతి, నిరంతర ఉగ్రవాదం వంటి

...మిగతాది 2 లో



## నాలాల్లో వరద సాఫీగా సాగాలి

### అధికారులను ఆదేశించిన హైడ్రా కమిషనర్

**జయభేరి, హైదరాబాద్ :**

వర్షాకాలం ముందుగానే ప్రారంభం అయ్యింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరద ముంచెత్తుతోంది. నాలాల నుంచి వరద నీరు సాఫీగా సాగడంలేదు. తేలిక పాటి వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే.. కుండ పోత వర్షాలకు నానా అవస్థలు పడాల్సి ఉంటుంది. ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి ఏం చేద్దాం`` అని హైడ్రా కమిషనర్ శ్రీ ఏ వీ రంగనాథ్ గారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ, మున్సిపల్ శాఖలలో నాలాల విభాగానికి చెందిన ఇంజినీరింగ్ అధికారులతో హైడ్రా కార్యాలయంలో శనివారం చర్చించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, రహదారులు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని కమిషనర్ గుర్తు చేశారు. ఈ క్రమంలో అందరూ అప్రమత్తంగా ఉండి

...మిగతాది 2 లో

# బాబోయ్..! పెరుగుతోన్న కరోనా..

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు

బెంగాల్ పర్యటనలో ఉన్న ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం మమతా బెనర్జీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారంకోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ, 2026 లో మమతా బెనర్జీ ప్రభుత్వం శాశ్వతంగా కూలిపోతుందని అన్నారు. "సుభేందు అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడినప్పుడల్లా దీదీ భయపడుతుంది. ఎన్నికల్లో మమతా బెనర్జీ హింసకు పాల్పడుతున్నారని అమిత్ షా ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని అన్నారు. హింస లేకుండా ఓటు వేయండి, మీరు వాస్తవాన్ని అర్థం చేసుకుంటారు" అని అమిత్ షా పిలుపునిచ్చారు. బెంగాల్‌లో ఎన్నికలు మాత్రమే అంశం కాదని, భద్రత కూడా ఒక కారణమని అమిత్ షా పేర్కొన్నారు. సంవత్సరాలుగా, మమతా ఆశీస్సులతో, బంగ్లాదేశ్ నుండి పెద్ద సంఖ్యలో చొరబాటుదారులు భారతదేశంలోకి ప్రవేశిస్తున్నారు. తద్వారా ఆయన ఓటు బ్యాంకు రాజకీయాలు కొనసాగుతున్నాయి. కానీ ఇది ఎక్కువ కాలం ఉండదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. బెంగాల్‌లో బీజేపీ అతి త్వరలో అధికారంలోకి వచ్చే ఒక సంఖ్యను కూడా ఆయన వెల్లడించారు. "మేము 19వ లోక్‌సభకు సిద్ధమయ్యాం. ఆ తర్వాత 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 77 సీట్లు గెలుచుకున్నాం. ఆ తర్వాత 24వ లోక్‌సభలో బీజేపీ 97 అసెంబ్లీ స్థానాల్లో ముందంజలో ఉంది. 143 స్థానాల్లో మనకు 40 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. అంటే, లక్ష్యాన్ని సాధించడంలో మనం మరికొంత పురోగతి సాధిస్తే, బీజేపీ ప్రభుత్వం తదుపరి ఎన్నికలకు సిద్ధంగా ఉంటుంది" అని అమిత్ షా అన్నారు. ముర్షిదాబాద్‌లో అల్లర్లు జరిగాయని అమిత్ షా అన్నారు. అల్లర్లను ఆపడానికి బిఎస్ఎఫ్‌ను పంపమని మేము మమతను అభ్యర్థించాము. మమత దానికి అంగీకరించలేదు. హిందువులను హింసించారు. తరువాత వారిని రక్షించడానికి BSF వచ్చింది. ముర్షిదాబాద్ ఒక రాష్ట్ర ప్రాయోజిత అల్లర్లు. వక్ఫ్ బిల్లు తీసుకురావడం ద్వారా మోడీ ఏదైనా తప్పు చేశారా? వక్ఫ్ కు వ్యతిరేకంగా నిరసన పేరుతో మమత ఎవరిని రక్షిస్తోంది? అని కేంద్ర హోంమంత్రి ప్రశ్నించారు. 2026 లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని శాశ్వతంగా కూల్చివేస్తామని ఆయన అన్నారు. సందేశ్‌ఖలిలో ప్రధాన నేరస్థుడు ఎవరు, అతనికి ఏ పార్టీతో సంబంధం ఉంది? RGKar నేరస్థుడు ఏ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు? అని అమిత్ షా ప్రశ్నించారు. మేము అధికారంలోకి వస్తే ఏ నాయకుడు జైలుకు వెళ్లరని గూర్ఖాలకు నేను హామీ ఇస్తున్నానని అమిత్ షా అన్నారు. మేము అధికారంలోకి వస్తే, CAA అమలు చేస్తామన్నారు. అయితే, మమతా, బెంగాల్ కోసం మీరు ఏమి చేస్తారు? మోదీ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.8,27,000 కోట్లు ఇచ్చారని అమిత్ షా గుర్తు చేశారు. మీరు మోదీ నుంచి నిధులు తీసుకోవాలనుకుంటే బెంగాల్‌లో మోదీ ప్రభుత్వాన్ని తీసుకురండి అని ఆయన అన్నారు . బెంగాల్‌లోకి చొరబాట్లను ఆపడానికి, బెంగాల్‌లోని హిందువులను రక్షించడానికి, కమలానికి ఒక అవకాశం ఇవ్వండి. మేము మిమ్మల్ని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నామని అమిత్ షా తెలిపారు.

## పండగే పండగ..

చేయనుంది. దీని కోసం రూ.6వేల 2వందల 50 కోట్ల నిధులను కేటాయించింది. ఇందులో భాగంగా మొదటి విడతలో జూన్ 2న రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించింది. రూ.50 వేల వరకు వంద శాతం, రూ.లక్ష వరకు 90 శాతం, రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ కింద రుణాలు మంజూరు చేయనున్నారు.

**పేరు మార్చండి: కవిత డిమాండ్..**

తెలంగాణలో కొత్తగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం పేరును బీఆర్ఎస్ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ పేరును మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణకు రాజీవ్ గాంధీకి సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత. తెలంగాణ అమర వీరులు శ్రీకాంత చారి, యాది రెడ్డి లేదా కాళోజీ లేదా పీవీ నరసింహా రావులలో ఎవరి పేరైన పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## నాలాల్లో వరద సాఫీగా సాగాలి

సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలాల సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని..ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ సూచించారు. నాలాల ఆక్రమణలో నివాసాలుంటే పరిష్కార మార్గాలు చూద్దాం.. ఇతర కట్టడాలుంటే తొలగించాల్సినవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో మీకేమైనా ఇబ్బందులుంటే నేరుగా సమాచారం ఇస్తే తాము చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాంతాలవారీ నాలాల సమస్యలను గుర్తించాలి.. మీరంతా స్పష్టమైన అవగాహనతో ఉంటే.. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చెరువుల పునరుద్ధరణతో పాటు..నాలాల పరిరక్షణకు ప్రభుత్వం చాలా ప్రాధాన్యతనిస్తోందని..ఆక్రమంలోనే కబ్జాల నివారణపై హైడ్రా దృష్టి పెట్టిందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. నాలాలు కుంచించుకుపోవడం.. మధ్యలో ఆటంకాలు ఏర్పడినా, ఆక్రమణలకు పాల్పడినా ఆ వివరాలివ్వాలని కోరారు. ఇందుకు సంబంధించిన నివేదిక రూపొందించాలని సూచించారు. కల్వర్టుల వద్ద చెత్త పేరుకుపోతోంది. ఆ చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యమే వరద ముప్పునకు ప్రధాన కారణంగా ఉందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. మలక్‌పేట వద్ద మ్యాన్ హోళ్ల నుంచి వరద పోటెత్తడానికి ఇదే కారణమన్నారు. చెత్త తొలగించే పనులు సాఫీగా సాగుతున్నాయా లేదా అనేది పర్యవేక్షించాలని సూచించారు. నాలాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలి. సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. హైడ్రా పోలీసు స్టేషన్‌లో వారిపై కేసులు పెట్టి విచారిస్తామన్నారు. ఈ ఏడాది నగరానికి వరద ముప్పు లేకుండా అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు.

## ఏపీ ప్రజలకు తీపికబురు

ఆప్యాయంగా పలకరించారు.. కిచెన్ లోకి వెళ్లి స్వయంగా టీ కాచారు. ఆ ఛాయ్ ని వడపోసి టీ కప్పుల్లో వేసి కుటుంబ సభ్యులందరికీ అందించారు. ఆ తర్వాత పెన్షన్ అందించి వారితో కాసేపు ముచ్చటించారు. ఒక మంత్రి నేరుగా తమ ఇంటికి రావడం.. కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోవడం..ఆప్యాయంగా పలకరించి టీ పెట్టి ఇవ్వడమే కాదు పెన్షన్ కూడా అందించడంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత గ్రామంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ కార్యకర్త ఆవాల నాగేశ్వరరావును పరామర్శించారు. అనంతరం గోవింద్ ఇంటికి వెళ్లిన మంత్రి అనిత.. వారి కుటుంబాన్ని పలకరించారు. కిచెన్‌లోకి వెళ్లి స్వయంగా టీ కాచారు. గోవింద్ కుటుంబ సభ్యులకు చాయ్ అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలు పెట్టిన భిక్షతోనే నేను ప్రజలకు సేవ చేస్తున్నాను అని అన్నారు. ఆదివారం సెలవు కావడంతో, ఫించన్‌లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్‌కి శంకుస్థాపన చేశానని, త్వరలో నక్కపల్లి ప్రభుత్వ హాస్పటల్ వద్ద కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత తెలిపారు. తాగునీటి, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నా, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు అనిత. ఉద్దండపురం జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీసీ కెమెరాలు, స్టాప్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు.

## పాకిస్థాన్‌కు గట్టి కౌంటర్

ప్రాథమిక మార్పులు బాధ్యతలను తిరిగి అంచనా వేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఒప్పందం సద్భావన, స్నేహంపై స్థాపించబడిందని, పాకిస్తాన్ ప్రవర్తన ద్వారా అటువంటి సూత్రాలు దెబ్బతింటున్నాయని ఆయన వెల్లడించారు. ఇక ఇదే వేదికపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని భారతదేశం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని విమర్శించారు. భారతదేశం ఏకపక్షంగా, "చట్టవిరుద్ధంగా" తీసుకున్న ఈ చర్య లక్షలాది మంది ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని ఆయన అన్నారు. "సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఒప్పందాన్ని నిలుపుదల చేయడం ద్వారా భారతదేశం ఎర్ర రేఖను దాటడానికి మేము అనుమతించం" అని షరీఫ్ పేర్కొన్నారు.

# బాబోయ్..! పెరుగుతోన్న కరోనా..

**మరోసారి కోవిడ్ భయం వెంటాడుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న కేసులు.. పాత రోజుల్ని గుర్తు చేస్తుండటంతో ప్రపంచ ఆరోగ్యసంస్థ స్పందించింది. ఇటు వైద్యులు కూడా కీలక సూచన చేశారు. ఆ వివరాలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందామా.. ఓసారి ఈ స్టోరీ చూసేయండి.**




దేశంలో కరోనా వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. రోజురోజుకూ కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. దేశ వ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,758కి చేరింది. ఈ పరిణామం ప్రజల్లో మళ్లీ కొవిడ్ భయాలను రేకెత్తిస్తోంది. కొవిడ్ మళ్లీ వ్యాప్తి చెందుతుండటంపై ప్రపంచ ఆరోగ్యసంస్థ స్పందించింది.

వ్యాప్తిలో ఉన్న ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8.1 సబ్ వేరియంట్లను 'పర్యవేక్షణలో ఉన్న వేరియంట్లు'గా వర్గీకరించింది. పలు దేశాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఎన్‌బీ.1.8.1 వేరియంట్‌తో ఇన్ఫెక్షన్ల వ్యాప్తి, ఆస్పత్రుల్లో చేరికలు ఒకేసారి పెరుగుతున్నా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఇతర వేరియంట్లతో పోలిస్తే ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందన్న సూచనలు ఏమీ లేవని తెలిపింది.

ఇప్పటికే ఆమోదం పొందిన కొవిడ్ వ్యాక్సిన్లు ఈ వేరియంట్ లక్షణాలు, ప్రభావాన్ని కట్టడి చేయడంలో సమర్థంగా పనిచేస్తాయని భావిస్తున్నట్లు తెలిపింది.

మరోవైపు కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే ఇంట్లో విడిగా ఉండాలని, వైద్యుల సలహాలు, సూచనలు అనుసరించి మందులు వాడాలని చెబుతున్నారు. ప్రయాణాల్లోనూ, జనసమూహాల్లో ఉన్నప్పుడు తప్పని సరిగా మాస్కులు వాడాలని సూచించారు. కొవిడ్ కేసుల ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చినవారు అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే నిర్ధరణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

**ఆందోళన కలిగిస్తున్న కరోనా కేసుల పెరుగుదల తీరు..**

దేశంలో మరోసారి అడుగుపెట్టిన కరోనా రక్కసి.. అంతకంతకూ విజృంభిస్తోంది. పదులు, వందలుగా ఉన్న కేసులు.. ఇప్పుడు వేలకువేలుగా పెరిగిపోవడం చూస్తుంటే.. అది నిజమే అనిపిస్తోంది. దేశవ్యాప్తంగా 685 కొత్త కరోనా కేసులు నమోదు కాగా... మొత్తం బాధితుల సంఖ్య 3, 395కి పెరిగింది. కొత్తగా జనవరిలో మొదలైన కరోనా వ్యాప్తి వల్ల.. ఇప్పటివరకూ 26 మంది ప్రాణాలు కోల్పోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

**కేసుల్లో కేరళదే టాప్ ప్లేస్**

కొవిడ్ 19 యాక్టివ్ కేసులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో.. కేరళ టాప్ ప్లేసును దక్కించుకుంది.

ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 1,336 యాక్టివ్ కేసులు ఉండగా.. ఆ తర్వాతి స్థానంలో 467 కేసులతో మహారాష్ట్ర, 375 కేసులతో ఢిల్లీ 265 కేసులతో గుజరాత్, 234 కేసులతో మన పక్కరాష్ట్రం కర్నాటక.. 205 కేసులతో వెస్ట్ బెంగాల్.. టాప్ ఫైవ్ జాబితాలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కరోనా ప్రభావం పెద్దగా కనిపించడం లేదనే చెప్పాలి.

**ఎప్పటికప్పుడు కేంద్రం మానిటరింగ్**

కొవిడ్ కేసులు ఒక్కసారిగా పెరగడమే కాదు, వైరస్ కారణంగా మృతిచెందుతున్నవారి సంఖ్య కూడా అంతకంతకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అందుకే పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వైరస్ ప్రభావం చాలా తక్కువ స్థాయిలోనే ఉందనీ.. బాధితులందరికీ ఇంటి దగ్గరే నయమైపోతోందనీ అధికారులు చెబుతున్నారు. భయపడాల్సిన అవసరం లేదంటూ ప్రజలకు భరోసా ఇస్తున్నారు. పాజిటివ్ కేసుల శాతం 13.8గా ఉంటే.. డెత్ రేట్ 1.7శాతంగా ఉన్నట్టు ప్రస్తుత లెక్కల ప్రకారం స్పష్టమవుతోంది.

**మొదటి మూడు పాతవే, నాల్గోదే కొత్తది**

పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో జన్యు శ్రేణి తక్కువ తీవ్రత కలిగిన ఓమిక్రాన్ సబ్‌వేరియంట్‌ల కారణంగా ఇన్ఫెక్షన్ పెరుగుదల కనిపిస్తోందని.. ICMR నిపుణులు అంచనా వేస్తున్నారు. నాలుగు ఓమిక్రాన్ సబ్‌వేరియంట్‌లు LF.7, XFG, JN.1, NB.1.8.1లు ప్రస్తుత ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతున్నట్టు నిర్ధారించారు. వీటిలో మొదటి మూడు, తరచుగా కనిపిస్తాయనీ.. నాలుగోది మాత్రమే కొత్తగా వచ్చిచేరినట్టు చెబుతున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నామంటున్న ఎక్స్‌పర్ట్స్.. అప్రమత్తత అవసరం అయినప్పటికీ, మరీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో..

టేకింగ్ లెటర్ రాసిచ్చినట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాలతో 14 నెలల పాటు అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావు భారత్‌కు తిరిగి రాబోతున్నారు. సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు కీలక నిందితుడుగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అతడిని విచారిస్తే ఈ కేసు ఒక కొలిక్కి వచ్చే అవకాశముందని దర్యాప్తు బృందం భావిస్తుంది. ఆ క్రమంలో ప్రభాకర్ రావును విచారించేందుకు దర్యాప్తు బృందం సిద్ధమవుతోంది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశాలతో స్వదేశానికి తిరిగి వస్తున్నారు ప్రభాకర్ రావు. ప్రభాకర్ రావు గతంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (SIB) OSDగా విధులు నిర్వహించారు. ప్రభాకర్ రావుపై లుకౌట్, నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఆయన పాస్‌పోర్ట్ రద్దు చేశారు. వీసా గడువు ముగిసింది. వీటన్నింటికి మించి రెడ్ కార్నర్ నోటీసు జారీ అయ్యింది. దీంతో భారత్ రావడం తప్పనిసరి అయ్యింది.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు



**జయభేరి, తార్నాక :**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు దిశ మహిళా సేవాసమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కె ఇందిర కృపాకర్.. ఈ సందర్భంగా జయభేరి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నో త్యాగాల ఫలితం పోరాటాల ఫలితంగా ఏర్పడ్డ రాష్ట్ర తెలంగాణ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అభివృద్ధి సమానంగా జరిగిన రోజే సామాజిక తెలంగాణ కల సహకారం అవుతుందని స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్ మాటలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్న ఈ తరుణంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మహిళలు ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మీడియా సమావేశంలో తెలిపారు.

## శ్రీ రాఘవేందర్ నగర్ కాలనీలో విస్తృతంగా పర్యటించిన కార్పొరేటర్ బన్నాల




■ చిల్కానగర్ డివిజన్ ప్రజలకు వర్షాకాలంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపడతాం

**జయభేరి, ఉప్పల్, జూన్ 01:**

చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆదివారం శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి గారి అభ్యర్థన మేరకు కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ కాలనీలోని లోతట్టు ప్రాంతాలలో వర్షం నీటి నిలువలతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని, కాలనీలోని సిసి రోడ్లు బాగా దెబ్బతిన్నాయని కొత్త స్టార్మ్ వాటర్ డ్రైన్ లకు, యు సిసి రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగింది. అదేవిధంగా కాలనీ వాసులకు రెండు మూడు నెలల్లో కాలనీలోని అన్ని పనులు పూర్తి చేస్తానని, ప్రజలకు వర్షాకాలంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపడతానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వాటర్ వర్క్స్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది ఉపేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఏదుల్లా కొండల్ రెడ్డి , కోకొండ జగన్, బాణాల నారాయణరెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, బాలు, బంటి గౌడ్ ,శ్యామ్ ,అశోక్ చారి, కాలనీ అసోసియేషన్ సభ్యులు,యాకోబు రెడ్డి, సత్యనారాయణ, గౌస్, కృష్ణయ్య, గోవర్ధన్, విట్టల్ రెడ్డి, మురళి, కృష్ణారెడ్డి, బద్రి , వెంకటేశ్వరరావు,గోపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, v.రజిత రెడ్డి, జయసుధ , ఝాన్సీ లక్ష్మి, కమల, పద్మిని, రమాదేవి, కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా..

**జయభేరి, ఉప్పల్, జూన్ 01:**

మెగా హెల్త్ క్యాంపులో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. తన సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రామంతపూర్ డివిజన్ పరిధి లోని నేతాజీ నగర్ కమ్యూనిటీ హాల్ లో మ్యాటిక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో దివంగత నేత ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి స్మారక ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భ గా ఆయన మాట్లాడుతూ... మానవుడు ఆరోగ్యంగా ఉంటేనే అన్ని సాధించగలడు, ప్రతి మనిషి మంచి





ఆహారం తీసుకొని వాకింగ్ ఎక్ససైజ్ చేసి ఆరోగ్యా నికి కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ ఈ ఫ్రీ మెడికల్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జోష్న, BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు ,బాబు యాదవ్ , బోసానీ పవన్ కుమార్ చాంద్ పాషా, నరేష్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం

**జయభేరి, వరంగల్ :**

తెలంగాణలో వానల తీవ్రత పెరిగిన నేపథ్యంలో.. వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజలను వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. మున్ముందు భారీ వానలు కురుస్తాయనే నివేదికల దృష్ట్యా.. వ్యాధుల విస్తరణ నిరోధానికి పలు నిర్దేశాలు చేశారు. దోమ తెరల వాడకం, నీటి నిలువ తొలగించడం, శుద్ధి చేసిన నీటిని తాగడం, బహిరంగ ఆహారాలు నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటివి ముఖ్యమని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు వంటి అనారోగ్య లక్షణాలున్న వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని.. అత్యవసరాలలో 108కి డయల్ చేయాలని సూచించారు తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలంగాణ ప్రజా వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది.వర్షాకాలంలో సాధారణంగా పెరిగే దోమల బెడదను నివారించడం అత్యంత ముఖ్యం. దీని కోసం, ఇళ్లలోని తలుపులు, కిటికీలకు మస్కిటో నెట్‌లను అమర్చుకోవడం ద్వారా దోమల ప్రవేశాన్ని అరికట్టవచ్చని వైద్య శాఖ సూచించింది. అంతేకాకుండా, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించవచ్చు. ఈ చర్యలు డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను గణనీయంగా తగ్గిస్తాయి.ఇక.. తాగునీటి విషయంలో కూడా అప్రమత్తత అవసరం. ఫిల్టర్ చేసిన లేదా కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని ఆరోగ్య శాఖ నొక్కి చెప్పింది. బయటి ఆహార పదార్థాలను తినడం మానుకోవాలని, వాటి వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది.వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలుప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. తరచుగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గాలి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల నివారణకు, జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలున్న వారికి దూరంగా ఉండాలి. ఒకరినొకరు కలుసుకునేటప్పుడు చేతులు కలపడం వంటివి తగ్గించుకోవాలి. ఒకవేళ అలా చేస్తే, తప్పనిసరిగా శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలి.ఎవరికైనా దగ్గు, జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి వంటి సీజనల్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చాలని వైద్య శాఖ విజ్ఞప్తి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 108కి కాల్ చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు అన్ని రకాల వైద్య సదుపాయాలతో, సిబ్బందితో సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరింది. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే, ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

# రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 1 :**

జూన్ 3 నుండి 20వ తేదీ వరకు కొత్త భూభారతి చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ దేశ నాయక్ తెలిపారు.ఈనెల 3న నాగాయపల్లి, గోపాలపురం, 4న కొండాపురం, శ్రీనివాసపురం, 5న వాసాలమర్రి, తిరుమలాపురం, 9న మాదాపురం, చిన్న లక్ష్మాపురం, 10న తుర్కపల్లి, మల్కాపూర్, 11న కోమటికుంట, వెంకటాపూర్, దత్తాయిపల్లి ,12న ఇబ్రహీంపురం, కోనాపురం, 13న వేల్పు పల్లి, ధర్మారం ,16న రూస్తాపురం, 17న గంధ మల్ల, 18న వీరారెడ్డి పల్లి, 19న ములకలపల్లి ,20 న పల్లె పహాడ్ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల రైతులు గత కొన్ని సంవత్సరాల నుండి పరిష్కారం కానీ భూ సమస్యలు ఏమైనా ఉంటే ఈ సదస్సులో పరిష్కరించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేయాలి

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 1 :**



ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో గ్రామంలో ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీబాయి పదవి విరమణ సభను ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీబాయిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి రికార్డు అసిస్టెంట్ స్థాయి నుండి వివిధ హోదాల్లో పనిచేస్తూ ఎంపీడీవో స్థాయికి ఎదగడం అనతి కాలంలోనే మండల స్థాయి ప్రజల మన్ననలు పొందడం ఆమె అంకిత భావానికి నిదర్శనమని అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో 43 సంవత్సరాలుగా పనిచేసిన ఎంపీడీవోను ఆదర్శంగా తీసుకొని మిగతా ఎంపీడీవో, ఉద్యోగులు జిల్లా స్థాయిని అగ్రగామిలో నిలుపుటకు తమ వంతు కృషి చేయాలని అన్నారు. తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామంలో జిల్లాలో మొదటగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ముందున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పి సీఈవో శోభారాణి, డి ఆర్ డి ఓ నాగిరెడ్డి, జెడ్పి డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మోతిలాల్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, సీఈవో రాఘవేంద్రరావు, రిటైర్డ్ డిప్యూటీ సీఈవో భగవాన్ రెడ్డి, పంచాయతీరాజ్ మినీ స్టీరియల్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి ,టీజీవో రాష్ట్ర కోశాధికారి మందడి ఉపేందర్ రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ ప్రసాద్, ఎంపీడీవోల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ జిల్లా ఎంపీడీవోల అధ్యక్షుడు బాలరాజు రెడ్డి, తాసిల్దార్ దేశ నాయక్, బొమ్మలరామారం ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, యాదగిరిగుట్ట ఎంపీడీవో నవీన్, రాజాపేట ఎంపీడీవో నాగవేణి, డిప్యూటీ తాసిల్దార్ కల్పన, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, నాయకులు పడాల చంద్రం, రాజారాం నాయక్, డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య, ఉపాధి హామీ ఉద్యోగులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# తుర్కపల్లి లో ఘనంగా తిరంగా ర్యాలీ

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 1 :**




తుర్కపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం నుండి ప్రధాన చౌరస్తా వరకు బిజెపి నాయకులు జాతీయ జెండాను చేత పట్టుకొని దేశభక్తి నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ దిగ్విజయంగా సందర్భంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతదేశం శాంతిని కోరే దేశమని, పాకిస్తాన్ తో చేసింది యుద్ధం కాదని ,భారత్ యుద్ధం చేసుంటే ప్రపంచ పటం నుండి పాకిస్తాన్ కనబడకుండా పోయేదని, భారత్ శక్తి ఏందో చూపించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరంగా ర్యాలీ జిల్లా కన్వీనర్ బుల్లెట్ మాధురి, జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, మాజీ మండల అధ్యక్షులు కందుకూరి చలమయ్య, కొక్కొండ లక్ష్మీనారాయణ, శత్రు నాయక్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు ,ఆకుల రమేష్, డొంకన రాజు గౌడ్, ధ్యాన బోయిన సత్యనారాయణ ,జక్కుల వెంకటేష్, ఏడుమూల ఆంజనేయులు, కనకయ్య, బొల్లు నరసింహ, రమేష్ నాయక్, నరేందర్ నాయక్, మేకల పాండు, భాస్కర్, పాముల ప్రవీణ్, కూరెళ్ల సందీప్ చారి, ఇమ్మడి సంతోష్ కుమార్, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 1 :**

జూన్ 6వ తేదీన తుర్కపల్లి మండలం తిరుమలపూర్ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థలాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని పూర్తిగా పరిశీలించి బహిరంగ సభకు, పార్కింగ్కు, హెలిపాడ్ కోసం స్థలాలను పరిశీలించారు. ఇట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డిసిపి అక్షాన్ష్ యాదవ్ , ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేంద్రరెడ్డి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీబీ శ్రీనివాస్ నాయుడు, సిఐ శంకర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ ఎలగొండ కృష్ణ, తాసిల్దార్ దేశ నాయక్, ఆర్ అండ్ బి ఈ బాల ప్రకాష్, ఎస్సై తక్యుద్దీన్, ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, ఆర్ ఐ లు జహంగీర్, రఘు రామారావు, కాంగ్రెస్ మండల



పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ వెంకటేష్, నాయకులు రాజారాం నాయక్, పాల్గొన్నారు.




# డిగ్రీ అడ్మిషన్ల కోసం దోస్త్ నోటిఫికేషన్ విడుదల

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ తెలంగాణలోన డిగ్రీ కోర్సుల్లో జాయిన్ అవ్వడం కోసం ఎదురుచూస్తున్న ఇంటర్ పూర్తి చేసిన గిరిజన (ఎస్టీ) విద్యార్థినిలకు మే 30 నుండి జూన్ 8 వరకు (దోస్త్ ఐడి ) రెండో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయని దేవరకొండ తెలంగాణ రాష్ట్ర గిరిజన మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం హరిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కరాటే విద్యార్థికి సన్మానం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లో కరాటే మాస్టర్ శ్రీను నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కరాటే క్యాంపు అభినందిస్తూ, SGF State Level school గేమ్స్ లో ద్వితీయ స్థానం పొందిన శివ రామకృష్ణను ఆర్కే సేవా ఫౌండేషన్ సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామరాజు, మాస్టర్ శ్రీను ను అభినందిస్తూ ఆత్మ రక్షణ కోసం కరాటే చాలా అవసరమని ముఖ్యంగా అమ్మాయిలకు చాలా అవసరమని అన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల మానసిక ఉల్లాసం, ఆరోగ్యంగా ఉంటారని ఆర్కె సేవ పౌండెషన్ ఎప్పుడు అండగా ఉంటుందని, వారికి చేతనైనంత వరకు సహాయ సహకారాలు చేస్తామని వచ్చిన వారికీ ధన్యవాదములు తెలియజేయడం జరిగింది. అనంతరం విద్యార్థులకు బహుమతులు, పండ్ల ను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు Md.అన్వార్, ప్రధాన కార్యదర్శి పొట్ట విజయ్ కుమార్, Md.మాకబుల్, రాజా, మల్లేష్,మాస్టర్ జగన్, తొంగరి ప్రతాప్,గుండాల వెంకట్ , మాజీ సర్పంచ్ రామకృష్ణ, బ్రహ్మంచారీ,కొండా ప్రేమ్ కుమార్, జక్కుల లింగం,కబడ్డీ కోచ్ చరణ్, కడారి అమరేష్, కే. లింగం, సురేష్, శ్రీకాంత్, రాగ్య నాయక్, రాంబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బహుమతులు అందించిన వడ్త్య రమేష్ నాయక్




**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం శాఖలీ శేరిపల్లి గ్రామం పంచాయతి పరిధిలోని నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలు గెలుపొందిన జట్టుకు బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు మూచర్ల శ్రీశైలం, శంకర్,ఆర్గనైజర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహన్ని ఏర్పాటు చేయాలి..



**జయభేరి, ఎల్బీనగర్, జూన్ 01 :**

తెలంగాణ జాతిపిత శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 25 అడుగుల కాంస్య విగ్రహన్ని కొత్తపేట లో ప్రతిష్ఠించుట అనుమతి నిమిత్తం ఆదివారం ఈరవత్రి అనిల్ కుమార్ ఛైర్మన్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు. పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి కి, విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. మంత్రి మాట్లాడుతూ... మీరు చాలా మంచి కార్యక్రమం తీసుకున్నారు అని అభినందిస్తూ, తెలంగాణ ప్రభుత్వ పరంగా సహకారం ఉంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ పున్న గణేష్ నేత, వైస్ ఛైర్మన్ కౌకుంట్ల రవితేజ, గుర్రం శ్రావణ్, పడాల రవీందర్, జెల్లా సూర్యకాంత్, తలాటి రమేష్, కోశాధికారి జెల్లా జగన్నాథం, రాపోలు సుధాకర్, నారని రవీందర్, చేరిపల్లి ప్రభాకర్, దోర్నాల చంద్రమౌళి, చిటుపోలు శ్రీనివాస్, మాకం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్వయం శక్తి ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన వర్క్ షాప్

**జయభేరి, విశాఖపట్నం :**

విశాఖ పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో వివిధ స్వయం శక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించిన పంచాయ తీలు, మండల పరిషత్ ప్రతినిధుల తో వర్క్ షాప్ జరిగింది.ప్రాజెక్టుల రూపకల్పన, స్వయం శక్తి సంఘాల ఆర్థిక స్వావలంబన, వార్షిక ప్రణాళి కలు తదితర అంశాలపై కేంద్ర పం చాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ చర్చించారు. కార్య క్రమంలో భాగంగా ఎంపిక చేసిన 88 మంది సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా చర్చిం చారు.



# ఎస్వీ కృష్ణారెడ్డిదే ఆ ఘనత

ప్రఖ్యాత దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, డా.రాజేంద్రప్రసాద్, అచ్చిరెడ్డి, శ్రీకాంత్, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, అలీ, శివాజీ రాజా, బండ్ల గణేశ్, గీత రచయిత చంద్రబోస్‌లతో పాటు ఎస్వీ కృష్ణారెడ్డి సినిమాల్లో కథానాయికలుగా నటించిన రోజా, ఆమని, రవళి, ఇంద్రజ, లయ కూడా పాల్గొన్నారు.


32ఏండ్ల కెరీర్‌లో 42 ఎవర్‌గ్రీన్ చిత్రాలను రూపొందించడమే కాక, ఎంతోమంది కళాకారుల జీవితాలకు బలమైన పునాదులు వేసిన ఘనత ఎస్వీకృష్ణారెడ్డిదని వారంతా కొనియాడారు. 'నేను అవకాశాలిచ్చానని వీరంతా చెబుతున్నారు. కానీ వీరంతా స్వతహాగా ప్రతిభామూర్తులు. నా సినిమాలు వారి ప్రతిభను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. అంతేకానీ వారికి నేను ప్రత్యేకంగా చేసిందేం లేదు.' అని ఎస్వీకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# భారీ సెట్‌లో డ్రాగన్ పోరాటాలు?



'దేవర' విడుదలై అప్పుడే తొమ్మిది నెలలు కావొస్తున్నది. కొత్త సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆగస్ట్ 14న బాలీవుడ్ 'వార్ 2'తో తారక్ రాబోతున్న విషయం తెలిసిందే. ఇక సోలో హీరోగా ఆయన నటిస్తున్న చిత్రం 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్). ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ కూడా ఓవైపు గప్‌చుప్‌గా జరిగిపోతున్నది. ఇప్పటికే దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఈ సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా వినిపిస్తున్న అప్‌డేట్ ప్రకారం ఈ నెల 3వ వారం నుంచి కొత్త షెడ్యూల్‌ని మొదలుపెట్టనున్నారట.

దీనికోసం బెంగళూర్‌లో ఓ భారీ సెట్‌ని కూడా నిర్మించారట. ఈ సెట్‌లో ఎన్టీఆర్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తారట. ఈ సీక్వెన్స్‌లో ప్రకాశ్‌రాజ్ కూడా పాల్గొంటారని సమాచారం. సినిమా మొత్తానికి ఈ సన్నివేశాలు మెయిన్ హైలైట్‌గా నిలుస్తాయని తెలుస్తున్నది. ఎన్టీఆర్ కెరీర్‌లోని అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా 'డ్రాగన్'ను నిలిపేందుకు ప్రశాంత్‌నీల్ ఎంతో శ్రమిస్తున్నారని, స్క్రిప్ట్ కోసం ఆయన ఎక్కువ సమయం తీసుకోవడానికి కారణం కూడా అదేని 'డ్రాగన్' టీమ్ చెబుతున్నది. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



# రూ. 5 వేలతో కెరీర్ మొదలు పెట్టింది..

చూడచక్కని రూపంతో ఆకట్టుకునే ఆ భామ దాన్స్‌ల్లో తోపు ఎవరో గుర్తుపట్టారా.? స్టేజ్ పై ఆమె డాన్స్ చేస్తే అలా చూస్తూ ఉండిపోవాల్సిందే. ఆ బ్యూటీ మన రెబల్ స్టార్ ప్రభాస్ తో ఆడిపాడింది. ఆమె మరెవరో కాదు నోరా ఫతేహి. బాలీవుడ్ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసింది నోరా ఫతేహి. నోరా ఫతేహికి దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. స్పెషల్ సాంగ్స్ కు పెట్టింది పేరు ఈ అమ్మడు. నోరా ఫతేహి ఎక్కడ ఉన్నా ఆ వైబ్ నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది. నోరా ఇండస్ట్రీలోకి రాక ముందు చాలా సవాళ్ళను ఎదుర్కొంది. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలని చాలా ప్రయత్నాలు చేసింది ఈ బ్యూటీ. అలాగే సినీ స్టూడియోల చుట్టూ తిరిగింది. ఎన్నో ఆడిషన్స్ ఇచ్చింది. కెనడా నుంచి చేతిలో రూ. 5వేలతో ఇండియాలో అడుగు పెట్టిందట నోరా. అవకాశాల కోసం చెప్పులు అరిగేలా తిరిగిందట. కడుపు నింపుకోవడానికి ఒక్క గుడ్డు, ఒక్క బ్రేడ్ మాత్రమే తినేదట అప్పట్లో.. ఇప్పుడు ఆమె ఓ స్టార్.. స్పెషల్ సాంగ్స్ కు కేరాఫ్ అడ్రస్. 5 నిమిషాల సాంగ్ కోసం రూ. రెండు కోట్లకు పైగా వసూల్ చేస్తుంది. అలాగే ఈ చిన్నదాని ఆస్తిపాస్తులు రూ. 50కోట్లకు పైనే ఉన్నాయట.

# కాల్ సెంటర్‌లో జాబ్ మానేసి..

కొంతమంది హీరోయిన్స్ ఒకటి రెండు చిత్రాలతో చాలా ఫేమస్ అయిపోతుంటారు. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. అతి తక్కువ సమయంలోనే కథానాయికగా గుర్తింపు తెచ్చుకుంటారు. కెరీర్ ప్రారంభంలోనే ఇండస్ట్రీలోని స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటారు. కానీ కొంతమంది ముద్దుగుమ్మలకు ఆ తర్వాత అదృష్టం కలిసి రాదు. ఒక్క సినిమాతో ఫేమస్ అయిపోయి వెంటనే కనుమరుగవుతారు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? అచ్చం కత్రినా కైఫ్ లా ఉండే ఈ బ్యూటీ మరెవరో కాదు జరీన్ ఖాన్. అందాల భామ జరీన్ ఖాన్, మహారాష్ట్రకు చెందింది. ఈ ముద్దుగుమ్మ . హిందీ, తమిళం, తెలుగు, పంజాబీ సినిమాలలో నటించింది ఈ అందాల భామ. 2019లో తెలుగులో వచ్చిన గోపీచంద్ హీరోగా నటించిన చాణక్య సినిమాలో ఏజెంట్ జుబెదా పాత్రను పోషించింది ఈ అమ్మడు. సల్మాన్ ఖాన్ సహకారంతో జరీన్ ఖాన్ 2010లో వీర్ సినిమాలో యువరాణిగా బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత 2011లో వచ్చిన కామెడీ బ్లాక్‌బస్టర్ సినిమా రెడీలో ఐటెమ్ సాంగ్ లో స్టెప్పులేసి మెప్పించింది. 2012 రొమాంటిక్ కామెడీ హౌస్‌ఫుల్ 2లో గ్లామరస్ మోడల్ పాత్రతో గుర్తింపు పొందింది ఈ ముద్దుగుమ్మ. 2013లో నాన్ రాజవగా పొగిరెన్ సినిమాలో ఐటెమ్ సాంగ్ మాల్గోవ్‌తో తమిళ సినిమారంగంలోకి ప్రవేశించింది. 2014లో జాట్ జేమ్స్ బాండ్ సినిమాలో ప్రముఖ పాత్రలో నటించి, బాలీవుడ్‌కి తిరిగి ఎంట్రీ ఇచ్చింది. 2015 ఎరోటిక్ థ్రిల్లర్ హేట్ స్టోరీ 3 సినిమాలో నటించింది. 2019లో యాక్షన్ థ్రిల్లర్ చాణక్య సినిమాతో తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెట్టింది. ఇప్పుడు అవకాశాల కోసం ఎదురుచూస్తుంది ఈ అమ్మడు.



# మ్యాడ్ హీరో గ్యాంబ్లర్స్ ట్రైలర్ మాములుగా లేదుగా..



'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన సంగీత్ శోభన్ ఇప్పుడు తన ప్రధాన పాత్రలో గ్లాంబ్లర్స్ అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమయ్యాడు. ఎప్పుడో విడుదల కావలసిన ఈ చిత్రాన్ని ఇప్పుడు థియేటర్స్‌లోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్స్ జోరుగా చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం టీజర్, ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసారు. తాజాగా ట్రైలర్ ను ఆవిష్కరించారు.

'ఆడటం చేతగాని వాడికి జూదం అంటే నేరం అనిపిస్తుంది.. ఆడటం తెలిసిన వాడికి జూదం నేరం కాదు ' అంటూ ప్రారంభమైన ఈ ట్రైలర్ లో ఒక క్లబ్ లో జరిగే సన్నివేశాలను చూపించారు. ఇందులో కొందరు వ్యక్తులు క్లబ్ లో గేమ్ ఆడటం, హీరో వాళ్ళతో ఏదో డీల్ సెట్ చేసుకోవడం, దాని వెనుక ఇంకేదో మిస్టరీ ఉందని అనుకునేలా ఈ ట్రైలర్ ఉంది. ఈ చిత్రంలో మిస్టరీతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ దండిగా ఉంటుందని అర్థమవుతుంది. మ్యాడ్, 'మ్యాడ్ స్క్వేర్' సినిమాల్లో కామెడీతో ఆకట్టుకున్న సంగీత్ శోభన్.. గ్యాంబ్లర్స్ అనే చిత్రంలో చాలా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. కౌబాయ్ తరహా కాస్ట్యూమ్స్ లో కనిపించి ఆకట్టుకున్నారు. ప్రశాంతి చారులింగా, రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్లోత్ర శివ, శివారెడ్డి, శ్రీకాంత్ అయ్యంగార్, మధుసూదన్ రావు తదితరులు ఈ చిత్రంలో ఇతర పాత్రలు పోషించారు.

ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. పూర్తి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించగా, ఈ చిత్రం చిత్రం అన్ని వర్గాలను అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 6న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.


Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com